నీతి... అవినీతి

★

శ్రీ బలివాడ కాంతారావు

ఆరు నెలల క్రితం గోవిందరావు యింటివద్ద ప్రతి రోజూ సాయంత్రం జరిగేచర్చల్లో ప్రసన్న కుమారి పెళ్లి విషయం ప్రస్తావనకు వచ్చింది.

అక్కడ కూడిన నలుగురిలో రిటైర్డు లెక్చరర్ రంగనాథం ఒకప్పుడు తన విద్యార్థియైన సత్యనారాయణ ఇలా ప్రవర్తిస్తాడని అనుకోలేదన్నాడు. "ఉద్రేకాలని అణచుకోలేని మనిషి వీధిలో కుక్కతో సమానం. యౌవ్వనం మనిషి జీవితంలో ఒక దశ. కామం మనిషి అనుభూతుల్లో ఒకటి. ఈ దశలో యీ అనుభూతిని పట్టపగ్గాలు లేకండా విడిచిపెడితే మిగతా దశలు, అనుభూతులు కోల్పినవారవుతారు"

ప్రక్కనున్న సాంఘిక సేవాతత్పరుడైన గోపాలం యీయనతో యేకీభవిస్తూ యీ మారుతున్న ప్రజల్ని చూసి విచారిస్తున్నానన్నాడు. ఈ చర్చల్లో పాల్గొనకండా కూర్చున్న సోమసుందరం మెల్లగా అన్నాడు "సత్యనారాయణ సుందరుడు వేశాడంటాను." ఈ ఫైనలియరు మెడికల్ విద్యార్థివైపు వయసుమళ్లిన యిద్దరూ చూశారు. గోవిందరావు చివరకు చర్చను ముగిస్తూ "కన్నతండ్రే నా కూతురు కాదన్నప్పుడు మావాడు కనికరించాడు. మా పెద్దన్నయ్యకు పెళ్లీడువచ్చిన పిల్లలున్నారు. వీడిలా చేశాడు కదా సాంప్రదాయకు లెవరొస్తారండీ. వీడిని లోబరచుకోడానికి ఆమె యెన్ని పన్నాగాలు పన్నిందో?"

ఈ చర్చ జరిగిన వారంలోనే సత్యనారాయణ విజయవాడనుంచి వుత్తరం వ్రాశాడు.

"నేనేదో ఆలోచించని పని చేశానని, మన కుటుంబ గౌరవప్రతిష్ఠలు గంగలో కలిపానని, నా పాపిష్టిముఖాన్ని జీవితకాలంలో చూడనని యిలా వాళ్లకోపాలు సంతుష్టించే భాషలో యిద్దరు అన్నయ్యలూ వ్రాశారు. ఈ వుత్తరాలు నా ప్రసన్న చదివింది. ఇంకో అన్నయ్య వూరుకున్నారేం? పెంపకానికి వెళిపోయామకదా, బహుశః, నాకెందుకని వూరుకున్నారా అని అడిగింది. నేను వెంటనే జవాబు చెప్పలేకపోయాను. తరువాత ఆ అన్నయ్య పవిత్రమైన జీవితాన్ని చెప్పాను. వదిన పిచ్చాసుపత్రిలో వుందనగానే చాలాగింజుకుంది. నేను ఆలోచించని పనిచెయ్యలేదని తృప్తిపడ్డాను, ఒకప్పుడు యీ జీవితంలో యెవరిదగ్గరికైనా వెళ్లే అవసరం నాకు వస్తే మా అన్నయ్య అని కాకండా ఒక సహృదయుడైన మనిషని నీ దగ్గిరికే వస్తాను"

ఈ త్తరం చదివాక అలాకూర్చొనే ఆలోచనలో పడ్డాడు. ఆమె ఒకడితో లేచివచ్చింది. వాడామెను ఒంటిగా విడిచివెళ్లిపోయాడు. వీడు వుద్ధరిస్తున్నట్లు ఆమెను పెళ్లిచేసుకున్నాడు. విభిన్నత్వంలో యేకత్వం యీ జాతులు యిస్తాయని తను నేర్చుకున్నాడు. ఈ జాతులమధ్య సంబంధాలకు అంత మనసీయలేకపోయాడు. ఆ మాత్రం మనసు కట్టలేకపోవటంవల్ల తన బ్రతుకు కోల్పుకున్నాడు. ఒకప్పుడు ఆమె వీడితో కొన్నాళ్లువుంటే — తన పిల్లల జీవితం?

"నీ వుత్తరం చేరింది. నివ్వొక యింటివాడివైనందుకు సంతోషం" అని రెండేముక్కలు జవాబు వ్రాశాడు.

ఈ వుత్తరం వ్రాసిన ఆరునెలలనాడు ప్రసన్న యిచ్చిన టెలిగ్రాం వచ్చింది. సంశయంలోపడినా తనొక సహృదయుడైన మనిషినని గుర్తుకురావటంవల్ల బయలుదేరాడు. తను వెళ్లటానికి యెందుకు సంశయించాడో అంతపనీ జరిగింది. అన్నయ్యకోసమే ఆ చివరి ప్రాణంతో వున్నాడు. ప్రసన్నను తనెంత ప్రాణతుల్యంగా చూచుకున్నాడో చెప్తూ ఒక పెద్దమనిషిని ఆమె జీవితకాలం సంరక్షకుడుగా వుంచాననే సంతృప్తిని వెళ్లబుచ్చి కళ్లుమూశాడు.

అక్కడవున్న నాలుగు రోజుల్లోనూ ప్రసన్న తనతో ఒక్కసారే మాట్లాడింది. ఈ తమ్మునితో యెలాను తెగతెంపులు చేసుకున్నారుకాబట్టి మిగతా యిద్దరి పెద్దవారికీ యీ కబురు అప్పట్లో తెలియపర్చవద్దని చెప్పింది. గోవిందరావు సంశయిస్తుంటే

"ఆ నేరం నామీద వెయ్యండి" ని నొక్కి చెప్పింది. ఈ నాలుగు రోజుల్లోనూ ఒక పెద్ద సమస్య తనను పీక్కు తిన్నది. తను జీవితంలో యేదో పెద్ద పొరపాటు చేస్తున్నానని బాధపడ్డాడు. ఇద్దరన్నయ్యలు తన యింటిమీద పడి యెంతగా పీక్కు తింటారో? ఈమెను తీసుకవెళ్లకపోతే వాళ్ల సంతోషానికి సరిహద్దులుండవు. మచ్చచూసిపోతోందని సంతోషిస్తారు. తను తీసుకవెళ్తేలోకం యింకోమచ్చ పెట్టుందేమో? ఆవూర్లోనే వుంచి నెలనెలా యేమైనా పంపిద్దామనుకున్నాడు. కానీ యీమె, సంఘానికీ, సాంప్రదాయాలకీ అతీతుడై త్యాగంచేసిన తన తమ్ముని జీవితాంతం తలుచుకొని వుండకపోతే యింతకంటె అపవిత్రురాలు యింకొకర్తె వుండదు. ఇక్కడవుంటే ఆమె అలా వుంటుందా? తీసుకవెళ్లటమే మంచిది. పిచ్చి కుదిరి భార్య యింటికి వస్తే యేమనుకుంటుంది? లెక్చరరు, గోపాలం వూరుకుంటారా? మీరిక్కడే వుండండి డబ్బు పంపిస్తానని చెప్దామని లేచాడు. ఆ దుఃఖితవదనాన్ని చూచి మాటాడలేకపోయాడు. తమ్ముడు యిక్కడ యీమెను విడిచిపెట్టడానికి తనను పిలిపించలేదని గుర్తుకువచ్చి తనతో తీసుకొనివెళ్లి వేరే యింట్లో పెట్టవచ్చునని బయలుదేరాడు.

ఇంటికి వచ్చిన వారంరోజులవరకూ ప్రసన్న తనవేపే చూడలేదు. ఆమె దుఃఖాన్ని చూసి దగ్గరకు వెళ్లటానికే జంకాడు. గోపాలంకు ప్రసన్న యీ యింట్లో వుండటం యిష్టంలేకపోయినా "సజ్జనుల యింట్లో పాపులు పతితులు కావటం సహజం" అన్నాడు. ఈ మాటలు ప్రసన్న వినకపోలేదు. గోవిందరావు రోజంతా తనేదో తప్పుచేశానని, లోకం తన గురించి యేమనుకుంటుందోనని భయంతో కూర్చున్నా లోలోన యేదో వుత్సాహం మెల్లగా అల్లుకుంటోంది. మూడుసార్లు మీకోసం వేరేయిల్లు చూశానని చెప్దామని దగ్గరగా వెళ్లాడు చెప్పలేక తిరిగివచ్చాడు.

తరవాత ఆమె కొద్దిగా లేచి యింట్లోనే తిరుగాడుతోంది. నాలుగురోజులు పోయాక చెప్దామనుకున్నాడు. ఆమె అప్పట్లో చిందరవందరగా పడున్న పుస్తకాలు సామాన్లు సర్దుతుండటం గమనించాడు. ఆ మరుచటిరోజు ప్రసన్న కోరి మాట్లాడటంతో గోవిందరావు తను వేరే యిల్లు చూశానని చెప్పటానికి సంకోచించాడు. "హోటలు భోజనాలు మనుషులని పిప్పిచేస్తాయ్. నాకు వండటానికి అభ్యంతరం లేదు. కానీ..."

గోవిందరావు జవాబీయకుండా మేడమీదకు వెళ్లిపోయాడు. తను మర్యాదగా ప్రవర్తించలేదని గుర్తుకు వచ్చింది. తన మౌనం అక్కర్లేదని జవాబిచ్చినట్లే అనుకున్నా ఆమె తనని గురించి యేమనుకుంటుందోనని వ్యాకులత చెందాడు. ఆమె యేమనుకుంటే తనకేం? ఎందుకో ఆమె మనసులో తను చెడ్డగా యెప్పుడూ వుండకూడదనే కోరిక తనని ప్రతి నిమిషం పీక్కు తింటోంది.

క్రిందికి వెళ్ళాడు. ప్రసన్న యేదో పుస్తకం చదువుతోంది. సహజమైన సిగ్గు, మర్యాదను ఆమె మూర్తీభవింపచేసింది. తను చెప్దామనుకున్నదొకటి చెప్పిందొకటి. వద్దులెండి, అన్న బదులు, మీకెందుకు శ్రమ అన్నాడు. ఆమె వెనువెంటనే "ఆయన మీలానే భోజనం తృప్తిగా వుండక్కర్లేదనుకొనేవారట. ఆరోగ్యం విషయంలో ఆధ్యాత్మికదృక్పథం వదలుకోవాలి"

ఈ మాటలు వినగానే గోవిందరావు అక్కడ నిల్చోలేకపోయాడు. తన దృక్పథాన్ని సమర్థించుకోడానికి మాటలు దొరక్కపోవటమే తనను కదలనిచ్చింది. ఈమె తనతమ్ముని మరచిపోలేదు. అయితే తన ఆరోగ్యంకోసం ఆమె యెందుకిలా ఆతృత చెందాలె? ఆలోచనలో పడిన కొద్దీ తనెనురుగా త్రెంచి యే విషయమైనా యెందుకు మాట్లాడకపోవాలి? నీ వంట నాకిష్టంలేదని చెప్తే సరిపోయేదిగా. ఆమెను వేరే యింటికి పంపిస్తే యీగొడవంతా లేకపోయేదిగా!

ఆ వేళ సాయంత్రం మాటల్లో గోపాలం అన్నాడు. "ఆడదానికి తగినకట్టుబొట్లని పెద్దలు వెట్టివాళ్ళై పెట్టారా? ఈ రోజుల్లో చదువుకున్న అమ్మాయిలకు యెంతగర్వమో అంతవేగిరంగా యే విషయంలోనైనా లొంగిపోతారు. చూడండి మా వీధిలో ఒకమ్మాయి బి. ఎస్. సి చదువతూ లేచిపోయింది. ఆ పిల్ల తండ్రి ఆ కూతురు పుట్టలేదే అనుకుంటాను అన్నాడు"

లెక్చరర్, కాలగతిలో మన హైందవ సాంప్రదాయాలు బుగ్గయిపోతూ, మన ఆదర్శనారీ రత్నాలలోని పవిత్రతను తెలుసుకోని యెందరు అమ్మాయిలు యీ రోజుల్లో వున్నారో వివరిస్తూ విచారాన్ని వెళ్లబుచ్చాడు. గోవిందరావు ప్రసన్న యీ మాటలు, లోనుంచి వింటూ బాధపడ్తూ వుంటుందేమో నన్నధ్యాసలో మనసులో చిరాకుగావున్నా వీళ్ల వాగ్ధాటి ఆగలేదు. మళ్ళీ అనుకున్నాడు ఆమె కష్టపడితే తనకేం? వీళ్ళు నిజం ఆడేటప్పుడు తన పాపానికి పశ్చాత్తాప పడుతుంది.

ఆ రాత్రి కేరియరు విప్పి భోజనంచేస్తుండగా ప్రక్కగది తలుపుచాటున నిల్చొని ప్రసన్న ప్రశ్నించింది. "మీరూ వాళ్ళతో యేకీభవిస్తారా?"

గోవిందరావు ఆమె మనసులో యేముందో తెలియక, తను యింకో అభిప్రాయం యిస్తే యేమనుకుంటుందోనని జవాబుకు తటపటాయించాడు. ఆమె అభిప్రాయం కోసం తనెందుకు ప్రాకులాడాలి? తనకున్న అభిప్రాయం చెప్పొచ్చుగా. కానీ యీలోగానే ప్రసన్న మళ్ళీ అందుకుంది. "ఆదర్శాలవెనువెంటనే పనులెప్పుడూ సాగవు. ఉదాహరణకి లోకచరిత్రే మీయెదరగా వుంది. సంఘం కట్నాల మోజులోపడి కుళ్ళిపోతోందని మీరూ ఒప్పుకుంటారనుకుంటాను. ఆ అమ్మాయి లేచిపోయిందంటే - ఆమె చదువుకుందని కొద్దిపాటైనా ఆలోచించే జ్ఞానంవుంటుందని ఒప్పుకుంటారనుకుంటాను. అలాంటప్పుడు ఆమె ఆ పని యే పరిస్థితుల్లో చేసిందో—అంటే ఆమె ఆదర్శాలకంటే పొందే బాధకే ప్రాధాన్యం యిచ్చివుంటుందని మీకు తట్టలేదా? బాధపడేవాళ్ళమీద సానుభూతి చూపించటం సంస్కారంకాదా? పాపం! ఆ తండ్రీ లోకానికి జడిసే కూతురు పుట్టలేదని అన్నాడే కానీ— అభిమానం లేదంటారా?"

గోవిందరావు అన్నం కలుపుతున్నవాడల్లా యింత పెద్ద సమర్థన వస్తుంటే వుండివుండి ఆమెవేపు చూడబోయాడు. మళ్ళీ ప్రయత్నించినా నోటిలోనికి ముద్ద వెళ్ళలేదు. ఆమెవేపు చూడాలని మనసు ముంగుకులాగుతున్నా ఆమె యేమనుకుంటుందోనని బలవంతాన నోటిలో ముద్దపెట్టి నమలలేక-నములుతూ తనెప్పుడూ యిలా ఆలోచించలేదే- ఎప్పుడూ ఆదర్శాల కొలబద్దతో మనుషుల బ్రతుకుల్ని కొలవటానికి ప్రయత్నించాడు. ఈమె కష్టాల కొలబద్దతో మనుషుల జీవితాన్ని కొలుస్తోంది.

అన్నం విడిచిలేస్తే బాగుండదని కష్టపడి తిన్నాడు. మేడమీదకు వెళ్లిపోతూ ప్రతీ చిన్న విషయంలోనూ ఆమె యేమనుకుంటుందోనని యెందుకు భయపడాలనిఅనుకున్నా భయపడకూడదని మాత్రం గట్టిగా నొక్కి చెప్పుకోలేకపోయాడు. టెర్రెస్‌మీద కుర్చీ వేసుకొని నక్షత్రాలవేపు చూస్తున్నాడు. మిణుకుమిణుకుమనే చుక్క సూర్యగోళంకంటె పెద్దదని తలపుకువచ్చింది!

ఆ రాత్రి ఆలస్యంగా నిద్రపోయినా వేగిరంగానే తెలివివచ్చింది. తన ముప్ఫయి యేళ్ళ వయసుగల నరాలు పీకినట్లనిపించినయ్. అలా పరుపుమీద నుండే ప్రసన్నను మనఃఫలకంమీద చిత్రించుకున్నాడు. ఒక్కసారిగా తన మార్పును తను గుర్తించుకున్నట్లనిపించి పిచ్చివాడిననని నవ్వుకున్నాడు. నవ్వుతూనే అబ్బే! ఆమైనా అసందర్భంగా అనలేదే! అంతకలుగజేసుకొని మాట్లాడిన ఆమెలో సంస్కారం మూర్తీభవించలేదా? తనలా ఆమె తొణకలేదు, బెణకలేదు. ఆమెలా తనూ యెందుకుండగూడదు? ఆమెనే ఆదర్శంగా యెందుకు పెట్టుకోవాలి? తనంత చచ్చుగా వున్నాడా? ఆమె చెప్పినదానిలో నీతి యేమాత్రం వుంది? కష్టాల్లో సహనాన్ని చూపించనివాళ్ళ జీవితాలూ జీవితాలే! కష్టాలను సాకుగా పెట్టుకొని కోరికలకు లొంగిపోయి చరిత్రలేని మనిషిగా బ్రతకటం హేయంకాదా? ఆమె అన్నదాంట్లో అర్థంలేదు. అయినా ఆమె గురించి తనెందుకాలోచించాలి? సరే - ఆమె అలావుంటుంది - నేనిలా వుంటాను. కానీ తన గుండెలోని లోలోపల తనెందుకామె గురించి ఆలోచిస్తున్నాడో చప్పునతట్టినా కాదు కాదని గట్టిగా అరవబోయాడు. అది నిజమనే ఆత్మసమర్థన తన నోటిని పెగలనీయలేదు— అవును—బిగియౌవ్వనంలో వున్న ప్రసన్న బంగారు ఛాయ ముఖంలో, కనీకనిపించని కాటుకరేఖ దిద్దినట్లున్న ఆకళ్ళల్లోని తళుకు! తను యిదివరకెప్పుడూ చూడలేదు.

ఆ కళ్ళను తన కంటిముందునుంచి తుడిచిపెట్టాలని కళ్లు గట్టిగా మూసుకున్నాడు. ఆమె తొంగి తొంగి చూస్తున్నట్లనిపించింది. చప్పునలేచి ఒళ్లు విరుచుకున్నాడు, జుత్తుపీక్కుని ఛా అంతా పీడకల అనుకుంటూ మేడదిగాడు. ఆమెవేపు పొరపాటునైనా చూడకూడదని భీష్మించుకున్నాడేమో అటువేపు తల, తిప్పలేదు. కాఫీకని హోటలుకు బయలుదేరుతుంటే ప్రసన్న మాటలు విన్నాడు "ఈ వేళనుంచీ నాకు హోటలు నుంచి యేమీ అఖ్ఖర్లేదు. ఏపనీ లేకండా యింట్లోకూర్చోవటంకూడ కష్టంగానే వుంది. నాగురించి నేనే వంటచేసుకుంటాను"

వద్దని అందామనుకున్నా ఆమె కెందుకు జవాబివ్వాలని తలవూపి వెళ్లిపోయాడు. నడుస్తూనే ఆమె అంత మర్యాదగా అంటే తను "మీ యిష్టం" అనైనా అనలేదే. మా తమ్ముడు పవిత్రుడని చెప్పాడు కదా—తను పవిత్రుడు కాడా? తన నీతియుక్తమైన జీవితం తలపుకురావటంతో ఆ తరహా మనుషులు సంతుష్టిపడ్డట్లెతినా పడ్డాడు.

హోటలునుంచి తెచ్చిన పార్సెలు ఆమె దగ్గరగా పెట్టినప్పుడు ఆమెవేపు చూడకండా వుండలేకపోయాడు. ఆమె తెల్లని చీరకట్టి నల్లని బ్లౌజు వేసింది. ముఖం బొట్టులేకపోయినా తళతళ మెరుస్తున్న ఆ శరీరచ్ఛాయ - ఆకళ్లు - అలా గంటల తరబడిచూడాలనే కోరికను బలవంతాన చంపుకొని ఒక్కసారి చూసి తిరిగిపోతుంటే ప్రసన్నగొంతుక

వినిపించింది. ఆగాడు ఆమె అలా చాటుగానిల్చొనే "మీరు చిక్కిపోతున్నారు. అక్కయ్య వచ్చాక నామీద నిష్ఠూరం వెయ్యదూ? నేను వండితే అభ్యంతరం వుంటుంది. పోనీ యెవరికైనా..." చప్పున "అబ్బే నాకటువంటి అభ్యంతరమేమీ లేదు" నాన్చుతూ అన్నాడు. ప్రసన్న "సంతోషం" అని పెరటుకు వెళిపోతోంది వెళిపోతున్న ఆమె వేపు చూశాడు. సర్వాంగసుందరమైన ఆమె, అడుగడుగు వేస్తుంటే హృదయంలో ఒక్కొక్క మెరుపు మెరుస్తోంది. ఆమె వెనువెంటనే మెల్లమెల్లగా వెళ్ళి—ఆ చీరకొంగుపట్టుకుంటే - ఆమె చప్పున తిరిగితే...ఆ కళ్లు!!

తిరిగి ఆమె తనవేపు వస్తున్నట్లు గమనించి సిగ్గుపడి మెల్లగా మేడమెట్లవేపు నడిచాడు. మళ్ళీ ఆమెవేపు తొంగిచూద్దామనుకున్నా చప్పున ఆ కోరికను, ఆత్మజ్ఞానం కలగటంచేత, బంధించి మనసులో తెంపలు వేసుకున్నాడు. తన యీగుండె నిబ్బరంలేని పనికి విసుక్కున్నాడు. ఆమెకు తను రక్షకుడు. ఆమె బాగోగులను చూసి, తన తమ్ముని ఆమె తలచుకొని ప్రశాంతంగా బ్రతికే వాతావరణాన్ని తను సృష్టించాలి కానీ, తనుయిలా నిమిషమాత్రమైన కోరికల్లోపడి ఆత్మను కోల్పోయి బ్రతకటం యెంత హేయం! ఈ నిమిషంనుంచి తను ఆమె అందం గురించి తలపుకు తెచ్చుకోకూడదు. ఏముంది? ఆ యెముకలపోగుకు అంటుకొని బింకంగావుండే కండరాలమీద పొందికగావుండే ఆ చర్మం - అది యెంత కాలం అలా వుండిపోతుంది? క్షీణించి బుగ్గిలోకలసే యీ అవయవాలపొంది కనుచూసి కామోద్రేకంతో వక్రమార్గాన్ని త్రొక్కడ మెందుకు?

ఆ వేళ యిల్లు కదిలాడు. తనకు పెద్ద బజారులో పెద్ద ప్రింటింగ్ ప్రెస్ వుంది. ఎప్పుడూ మేనేజరే చూస్తున్నాడు. ప్రెస్‌లోనూ యెంతసేపూ వుండలేక గోపాలం యింటికి వెళ్లాడు. గోపాలం వండుకుంటూనే మాట్లాడుతున్నాడు. తన యౌవనంలో భార్యతో మాటామాటా వచ్చి ఆమెను విడిచిపెట్టాడు. అప్పటినుంచీ యింకో పెళ్లి చేసుకోకండా తనే వండుకుంటూ బ్రతుకుతున్నాడు. ఎంత గట్టివాడో! గోవిందరావు ఆయన చరిత్రతో తన చరిత్ర పోల్చుకుంటూ ఆయన చెపుతున్న విషయాలకి వూఁ కొడుతున్నాడు. చివరికి ఆయన ప్రసన్న విషయంలోనికి దిగాడు. "నేనైతే - నీ గురించి తెలుసును కాబట్టి అలా అనుకోను. కానీ లోకులు యేమైనా అనటానికి అవకాశం యిచ్చావు. నీ అన్నయ్యలిద్దరూ గొడవచేస్తున్నారుగా. అంచేత ఆమెను యెక్కడకైనా పంపించి యేమైనా భరణంకిందంటే పంపించు" ఆయన యెదరగా నేమీ జవాబు చెప్పలేక నడిచిపోతూంటే అప్పట్లో ఆమెను పంపించివేయటం జరిగేపని కాదని తట్టింది. ఇంటికివెళ్ళేసరికి ప్రసన్న తనకోసమే కాసుకొని కూర్చుంది. గోవిందరావుకు యిష్టంలేకపోయినా తను తొట్రుపాటులో యిచ్చిన జవాబు జ్ఞప్తికివచ్చి భోజనానికి కూర్చున్నాడు. ఇంటి భోజనం చాలా కాలానికి అనుకున్నా తను యీమెచేతి వంట తింటున్నానని తెలిస్తే—భోజనం చేస్తుండగా "ఇన్నాళ్లూ నేను వద్దామనుకున్నా రాలేకపోయాను. నన్నూ ఒకసారి అక్కయ్యను చూడనివ్వండి" అంది.

గోవిందరావు మాటాడలేదు. ఎందుకో యీ కోర్కె తీర్చలేనిదని వుద్రేకపడ్డాడు. తింటున్నంతసేపూ యెదురుగా ఒకపండు ముదుసలివున్నట్లే కోరి కోరి భావించాడు. కానీ లేచేముందు తలెత్తేసరికి లేనగవుతో మిసమిసలాడే యౌవ్వనంతో ఒళ్లంతా పులకరింపచేసిన అంగన నిల్చుంది?

ఆ వేళ సాయంత్రం మామూలుగా నలుగురూ కూడారు. సోమసుందరం యిదివరలా కాకండా రోజూ వస్తున్నాడు. రానురాను యీ చర్చల్లో పాల్గొంటున్నాడు. ఈ వేళ పాపపుణ్యాల గురించి వచ్చిన ప్రస్తావనలో సోమసుందరం చివరకు ప్రశ్నించాడు "ఒకమ్మాయిని దగాచేసి భర్త వెళ్లిపోతాడు. మళ్లీ ఆమె పెళ్లిచేసుకుంటే పాపమా?" ఈ ప్రశ్నకు వెంటనే జవాబురాలేదు. ఎంచేతంటే ముగ్గురి మనస్సుల్లోనూ యీయన ప్రసన్న ప్రసక్తే తెచ్చాడని స్ఫురించటంవల్ల. గోవిందరావుకు యీ ప్రశ్న చిరాకెత్తించింది. అంతలో వూరుకోక సోమసుందరం మళ్లీ అన్నాడు "అది అవినీతి అంటారా?"

గోవిందరావు మనసు యీర్ష్యతో నిండిపోయింది. ప్రసన్న విషయం యెత్తడానికి వీడికేం అధికారం వుంది. బలవంతాన కోపం ఆపుకున్నాడు. గోపాలం తరవాత జవాబు చెప్పాడు "ఎందుకులే. అది నీతో, అవి నీతో. పాపమో పుణ్యమో తరవాత తెలిసివొస్తుంది. రక్తం బింకంగావున్నప్పుడు యేదీ తెలిసిరాదు!"

ఆ వేళ రాత్రిభోజనం దగ్గర ప్రసన్న మాటలకోసం యెంత మెల్లగా వింటున్నా వినిపించలేదు. బహుశః ఆ వేళ చర్చ ఆమెకు కష్టాన్ని కలిగించిందేమో? లేక తన మౌనం ఆమెకు నచ్చలేదేమో? ఆ తియ్యనిమాటలకోసం యెదురుచూసి విసిగెత్తి తలెత్తాడు. కినుక జెందిన చిహ్నాలేమీ కనపడలేదు. ఇక ఆమె మబ్బువిడిచిన చందమామ - మెరుగు పెట్టిన బంగారం - ఆమె నడకలో వయ్యారం మళ్లీ యీ

నాటికి పూర్తిగావచ్చింది. తన నరాలన్నీ వుబ్బుతున్నా అణచుకొనే శక్తి కృశిస్తోంది. తనవునికిని మరచిపోయి మళ్లీమళ్లీ ఆమెవేపు చూడబోయాడు. లేచేటప్పుడు యెదరగా ప్రసన్న లేదు.

మెల్లెక్కుతూ యింతవరకూ తనేంచేశాననే తలపురాగా మేడమీదకు వచ్చి కుర్చీలో కూలబడిపోయాడు. వెలుగుతున్న లైటువేపు చూడలేక ఆర్పి టెర్రెస్ మీద కుర్చీలో కూర్చున్నాడు. రాను రాను ఆలోచనలు క్రమ్ముకొంటటంవల్ల మెదడు వేడెక్కింది. చప్పున తనెంతగా మారిపోయాననే స్పృహ తెచ్చుకున్నాడు. తను మారిపోయాడు. పూర్తిగా మారిపోయాడు.

అప్పుడే చందమామమీదికి లేస్తున్నాడు. ఆలేవెలుగులో యెదరగావున్న చిగిర్చినచెట్టు, చిన్నగాలికి ఆడే ఆకులు - హృద్యమైన ఆదృశ్యంవైపు మనసు పరుగులెత్తింది. రానురాను చల్లనికాంతులను కొల్లలుగా విరజల్లుతున్న చందమామను చూస్తున్నాడే గానీ...అలా చూస్తుంటే తను చూస్తున్నది చందమామను కాదు - ప్రసన్న ముఖారవిందాన్ని!

లేచిపోయాడు. మెట్లవరకు నడిచాడు. ఎటు వేపుచూసినా ఆ సౌందర్యరాసే ప్రత్యక్షమౌతూంది. ఏదో ఘోష వినిపిస్తున్నా వినిపించుకోక మేడ దిగాడు. పరుపుమీద చారబడి ప్రసన్న యేదో చదువుకుంటోంది. స్తంభంచాటున నిల్చొని రెప్పవెయ్యకుండా చూశాడు. తను యిదివరకు వూహించని అందం - అందులో ఆమె వయ్యారమంతా వలబోసుకొని స్వేచ్ఛగా వుంది.

కళ్లుమూసుకుందామని ప్రయత్నించానను కున్నాడు. కానీ ఆమె కాస్తసర్దుకోగానే భయం వేసింది. ధైర్యం తెచ్చుకొని రెండుగులు వేశాడు. ఆమె పుస్తకం ప్రక్కకు పెట్టి చూసిచప్పున పర్దుకొని లేచి తలుపుచాటుకు వెళిపోయింది. చెంపపెట్టు నడివీథిలో తగిలినట్లు బాధపడ్డాడు. ఆ క్షణంలోనే ధైర్యాన్నంతా కూడగట్టుకొని సగం బెణుకుతో "సాయంత్రం వాళ్ళేదో అన్నారని బాధపడ్డారేమో? రేపటినుంచీ వాళ్లలా అనకుండా వుండేటట్లు చూస్తాను."

ప్రసన్న కొద్దిగా ముందుకువచ్చి "చర్చలిని మాత్రం ఆపకండి. వాటివల్ల నా మెదడుకుకూడా కొంత మేత దొరుకుతుంది. ఒకరు యేదో అన్నారని లేక అనుకుంటారని నేనెప్పుడూ బాధపడను. దుఃఖంలోనూ సుఖపడటమెలానో నాకొక్కంత తెలుసు"

గోవిందరావు ఆ చివరి మాటలతో తన పరిస్థితికి చివుక్కుమని తిరుగుముఖం పట్టాడు. పరుపుమీద పడి గట్టిగా యేడవాలనుకున్నాడు. బ్రహ్మాండమైన చిరాకుతో యిటూ అటూ పొర్లుతూ తలగడ మీద తలకొట్టుకుంటూ కొంతసేపు బాధపడ్డాడు. రాత్రి దొర్లుకుపోతోంది. గంటల తరబడిగింజుకొని కర్తవ్య విమూఢునిలా లేచాడు. ప్రకృతి నిదురిస్తోంది. వెన్నెల యిప్పుడేదో ప్రశాంతతని తెచ్చిపెట్టింది. ఆకాశంవేపు చూశాడు. నక్షత్రాలు అక్కడక్కడ మిణుకుమిణుకు మంటున్నాయ్. ఏవో తెలియని, తెలుసుకోలేని అనుభూతులతో మనసు నిండిపోయింది. ఈ ఆకాశం - చుక్కలు - ఈ మనుషులూ, ఆరాటాలూ, సంతోషాలూ, చావు పుట్టుకలూ ఈ జగన్నాటకానికి కారకమైన పవిత్రాతిపవిత్రమైనదీ, సర్వవ్యాప్తమైనదీయైన ఆ శక్తి- చేతులు మనసునిండుగా జోడించుకున్నాడు. "ఆమెను ఆరూపంతో మనసులో పెట్టుకోకుండా వుండే గట్టిమనసు నియ్యితండ్రీ!"

భక్తితో నిండిన మనసుతోవచ్చి పరుపుమీద పడ్డాక నిద్రవస్తుందనుకున్నా రాలేదు. కోరికతో యీవేళ దేవుని పేరెత్తి, భక్తి అని మురిసిపోయి ఆ శక్తికి అపచారం చేశావని తనలోనున్న జ్ఞానమేదో తనమీద దాడిసలిపింది. తనలో ఆ ప్రయత్నంలేనిదే దేముడేంచేస్తాడని మనసుకు తట్టడంవల్ల నిద్దరపట్ట లేదు. లేచి లైటు వెలిగించాడు. తెల్లని కాగితం మీద ఒక బొమ్మవేశాడు. అడుగున పెద్ద అక్షరాలతో ఆ బొమ్మపేరు వ్రాశాడు. శాంతించి నిద్రపోయేవరకు ఆ బొమ్మవేపు చూస్తూనే వున్నాడు.

తెల్లవారేసరికి పని మనిషి గదితుడుస్తోంది. "మామ్మా! రాత్రీపగలు యిక్కడేవుండిపోకూడదూ? మీవాళ్లని చూడాలనివుంటే అప్పుడప్పుడూ యింటికి వెళ్లవచ్చు" అన్నాడు. మామ్మ యింట్లో కనుక్కొని చెప్తానంది. ప్రొద్దున్న కాఫీ టిఫిన్ అయ్యేటప్పుడు మనిషి చెక్కు చెదరలేదు. తరవాత అలా ప్రెస్ వేపు వెళిపోయాడు. శరీరాన్ని కష్టించకపోవటంవల్ల వచ్చే అనర్థమిదని స్ఫురించటంవల్ల ప్రెస్‌లో కూలీచేసిన పనికూడా చేశాడు. చేస్తున్నప్పుడు యెంతో గర్వించాడు. రోజూ దీనికి అలవాటుపట్టున్న కొద్దీ తనలో ఆమెవేపు జూడకూడదన్న పంతం హెచ్చుతోంది. కానీ ఆ పంతంలో ప్రతినిముషం ఆమెనే తలుస్తున్నాడు. రాత్రుళ్లు యిదివరలా కల్పనా సాహిత్యాన్ని కాకుండా వేదాంత గ్రంథాల్ని తెచ్చి చదువుతున్నాడు. ఇంట్లో ఒంటరిగా వున్నప్పుడు ఆమెకళ్లకుకట్టే

యెదురుగా ఆ బొమ్మ పెట్టుకొని శాంతించానని చిరునగవు తెచ్చుకోనేవాడు.

నెలరోజులు గడిచాయి. అప్పుడప్పుడూ ప్రసన్న అక్కను జూడాలని వుందని అంటున్నా విననట్లే వూరుకొనేవాడు. ఒక్కొక్కసారి తొందరేం కొంతనయమయ్యాక జూడవచ్చని యిలా మాటలతోనే గానిచ్చాడు. ఈరోజు ప్రసన్న నిర్బంధించినట్లు మాట్లాడింది. ఇంట్లో పని మనిషి లేకపోవటంవల్ల తాళం వేసి బయలుదేరారు. టాక్సీలో కూర్చొని కదులుతున్నా తను యీమె మనసు కష్టపెట్టకూడదనే కనికరంవల్ల తీసుకవెళ్తున్నానని అనుకున్నా మళ్లీ యెందుకు వెళ్తున్నానని బాధపడుతూనే వున్నాడు.

ఇద్దరూ రావటంజూసి భార్య ముందుకొచ్చి కటకటాలనుంచి జూసింది. ఒక క్షణం అలా చిల్లంగి పెట్టినట్లు యిద్దరి ముఖాలవేపు జూసి పకపకా నవ్వింది. ఆగి యిద్దరికళ్లల్లోనికి జూడబోయింది. గోవిందరావు అప్పటికే ముఖం త్రిప్పేశాడు. ఆమె భర్తను జూపిస్తూ “చూడండీ అహహా - అ ముఖం చూడండీ!” వికటాట్టహాసం చేసింది. వెనువెంటనే కళ్లల్లో నీరుకారుకొచ్చినయ్. అలా కన్నీరు కారుస్తూ గజాలకు అన్చిన భర్తచేతిని పట్టుకొని యేడుస్తూ “మీరు యేమన్నారు? ఈ జీవితంలో ఒక మనిషికి ఒక స్త్రీకే సంబంధం. రేపు నేను చచ్చిపోతేనువ్వు, నువ్వుచచ్చిపోతే నేను-వచ్చే జన్మలో కలసిపోడానికి అలా వుండవలసిందే నన్నారు - జ్ఞాపకం తెచ్చుకోండి.”

ఆమె అక్కడనుంచి చరచరా వెళిపోయింది మళ్లీ “ఉహు. ఉహు, - వెఱ్ఱిలోకం!” నవ్వుకుంది. ముఖం ముడుచుకొని మళ్లీ యేడ్చింది. ఇంతవరకు తలెత్తకండా నిల్చున్న గోవిందరావు తలెత్తేసరికి ప్రసన్నకళ్లు ఒత్తుకోవటం జూశాడు. భార్య ఒక్కసారి గట్టిగా గసిరింది “నివ్వెందుకేడుస్తావ్? నా వారిని నీవారిని చేసుకున్నావ్ గా? హాయిగా వుండండి”

గోవిందరావు చప్పున కదలగానే ప్రసన్న కొద్దిగా ఆగి యేదో అందామన్నా అనలేక మెల్లగా కదిలింది. “నర్స్ నర్స్!” అని అరుస్తూ వెళిపోతున్న భర్తవేపు జూపిస్తూ “ఆయన యెంత మంచివారు - యీ నాటికి...!” అంటూ గట్టిగా యేడుస్తోంది. కారు వెళిపోతున్నా యేడుపు వెంటనే వస్తున్నట్లుండటంచేత ప్రసన్న కళ్లలో నీరు చిమ్ముతూనే వుంది.

కారు సముద్రతీరానికి అంటుకొనివున్న రోడ్డుమీద పోతోంది. ఇద్దరూ వెనుక సీటులో రెండు చివరల్లో కూర్చొన్నారు. హాయినిచ్చే గాలివీస్తోంటే గోవిందరావు వుండివుండి ఆమెవేపు జూస్తున్నాడు ప్రసన్న అప్పుడప్పుడు దుఃఖితవదనాన్ని తనవేపు త్రిప్పుతోంది. క్షణక్షణాకి హెచ్చుతున్న వుద్రేకాన్ని అణచే ప్రయత్నంలోనే వున్నాడు. ఆమె దగ్గరగా జరిగి ఓదార్చాలనే కోరికకోరికలానే వుండిపోయింది.

కారు దిగి మేడమీదకు వెళ్లిపోయాడు. కొంతసేపయ్యాక టెర్రెస్ మీదకు వచ్చేసరికి సోమసుందరం యింటినుంచి వెళిపోవటం గమనించి ప్రసన్న తన పరిస్థితిచూసి లేరని జబాబు చెప్పివుంటుందని మళ్ళీ గదిలోనికి వెళిపోయాడు.

రాత్రి భోజనందగ్గర ఆ మూర్తి అంత సౌందర్యాన్ని రెట్టించుకున్నట్లగపడింది. సిగ్గువిడచి పదేపదే చూడాలనుకున్నా మనసు మళ్ళీ వెనుకకు లాగింది. ప్రసన్న ఒక్కమాటైనా అనలేదు. ఆనీలైన ముక్కు దిగువగా తేనెలొలుకు పూగుత్తులనిపించే ఆ పెదాలవేపు లేచిపోతూ కదలలేక కదిలిపోతూ చూశాడు.

ఒంటిగా కూర్చున్న కాలమంతా ఆమె అందాన్ని ఆకళించుకున్న మధురక్షణాలయ్యాయ్. మళ్లీ నిస్పృహతో బరువెక్కిన మనసుతో గదిలోనికి వెళ్లి పరుపుమీద వ్రాలాడు. ఆమె కనురెప్పలు తన కళ్ళల్లో కదులుతున్నాయి. కోరికను ఆపలేని మనసులో యిదివరకు పెట్టుకున్న పాపభీతి అంతా యేదో స్వలాభంతోనే పెట్టుకున్నట్లనిపించింది. అవును కాకపోతే నలుగురూ తను పవిత్రుడనుకోవాలనే వుబలాటేకదూ యిదంతా! తనకెందుకీ మనోవ్యథ? ప్రసన్నలోని మధురాన్నంతా తనెందుకు గ్రోలకూడదు? విపత్తులతో నిండిన యీ జగత్తులో యీ నమ్మకాలన్నీ పాతబడిపోయాయి. ఇన్ని కోట్ల ప్రజల్లో నీతిగా బ్రతికేవాళ్లెందరు? వాళ్లల్లో నేనొక్కడిని కాలేకపోతేనేం? తనకెందుకీ నీతి? లెక్చరరు గోపాలం తనను చిన్నప్పటినుంచీ కాళ్లు చేతులు కట్టేశారు. బోనులో పెట్టి సర్కస్ మాష్టర్లా ఆడిస్తున్నారు. గోపాలం యౌవనంలో కోరికల్ని కట్టుబాటుచేసుకొని వుండగలిగాడా? ఆయనదంతా అబద్ధంతో కూడిన స్వంతడబ్బా. లోకం కళ్ళల్లో దుమ్ము కొట్టడానికే యివన్నీని. తను యీ తేనెను యెందుకు గ్రోలకూడదు?

కిటికీగుండా వెన్నెల పక్కమీద పడుతోంది. లేచిపోయాడు పెరట గ్రీన్ వేపు కాలు కదిపాడు. అప్పుడే చిన్న చిన్న మబ్బుముక్కలు చంద్రుని దాటి వెళిపోతున్నయ్. కారులో ప్రసన్నను జూస్తున్నట్లనిపించింది. అనుకోకండా తలవంచాడు. పెరట తామరాకుల మధ్యతలెత్తి వికసించిన ఒంటరి తెల్లకలువలా వుంది ప్రసన్న!

మెరుపులాంటి తలపుతో గదిలోనికి వచ్చాడు. ఆమె తనలాంటి మనిషే. ఆమెదీ తనలా యౌవ్వనపు దశే. తనకుండే కోరికలు ఆమెలోనూ వుండాలి. లేదా అంటే కారులో - తన్మయమూ ముగ్ధమూ చేసే ఆ చూపూ - ఆ శక్తీ...మళ్ళీ మెల్లగా తొంగి చూశాడు. ఈసారి ఆమె కదులుతోంది - ప్రియుని కోసం వెన్నెల్లో వెదకే ఉజ్వలాభిసారికలా...!

నరాలిప్పుడు తన స్వాధీనంలో లేవు. గబగబ గదిలోనుంచి మెట్లవేపు నడిచాడు. ఎదురుగా చటుక్కున యెవరో కనిపించారు. ముఖంమీద జుత్తు వ్రాలింది. అయినా దాటుకొని వెళ్లినట్లు రెండడుగులు వేసేసరికి "అన్నయ్యా! ఇదేనా నీ పెద్ద మనిషితరహా... నేనెంతో సంతృప్తితో చచ్చిపోయాను - కానీ నివ్వింత...!" వెళ్తూనే ఆగిపోయి వెనుతిరిగి జూశాడు. ఆ కనిపించిన వ్యక్తి తన గుండెల్లోనే బాధతో మూలుగుతున్నట్లనిపించింది. సాహసించి కాళ్లు కదుపుదామన్నా విరిగిపోయినట్లున్నాయి. పెద్ద నిట్టూర్పు విడిచాడు. తనకళ్లయెదుట తను వ్రాసుకున్న బొమ్మ వుంది. అలా కళ్లు నిలబెట్టే ఒక్కొక్క అడుగూ మీదికి వేసాడు. ఇంకా మనసు ఆ వుద్రేకపు గుఱ్ఱం కళ్లెం లాగటానికే ప్రయత్నిస్తోంది. ముడతలుపడ్డ ముఖం యెముకలపోగు - యిదే ప్రసన్న - మళ్లీమళ్లీ అనుకున్నాడు. మనిషి రానురాను చిక్కిపోతున్నట్లనిపించింది. ఉద్రేకాలని అణచుకున్న మనుషుల జీవితాలే శాశ్వతంగా నిల్చిపోయాయి. తనొక రాజమార్గాన్ని వీడి క్షణికమైన ఆనందం, తృప్తికోసం త్రాగుబోతులా కాబోయానని తన్నుతాను దూషించుకోసాగాడు. ఆ యెముకలపోగును మనసులో దీక్షగా పెట్టుకుంటేనే గానీ నిద్దర రాలేదు.

తెల్లవారింది. లేవగానే పెరటకువెళ్లి తోటలోనికి జూశాడు. రాత్రివుండే ఆహ్లాదకరమైన వాతావరణం యేమీలేదు. అయ్యో! తనెంత తెలివి మాలిన పని చేశాడు. మళ్లీ అటువంటి మధురక్షణాలు వస్తయ్యా?

కాఫీ త్రాగుతూ ప్రసన్న వేపు చూడబోతుంటే తమ్ముని గురించి వస్తున్న తలపులను తొలగించుకున్నాడు. పోయినవాడు పోయాడు. వాడి గురించి తనెందుకంతగా తలచుకోవాలి? బలవంతాన తన ఆనందానికి అంతరాయం తెస్తున్న తలపులను ప్రక్కకు నెట్టగలుగుతున్నాడు. ఇదివరకు తనలోనున్న శక్తి తన నీతిని కాపాడుకోడానికే వుపయోగించేవాడు. తన కాలాన్ని యింకోలా వినియోగించటం నేర్చుకోలేదు. ఇప్పుడు ఆమె అందాన్ని గురించి కోరికతో కూడిన తలపుతో తప్పించి కాలాన్ని ప్రయత్నించినా యింకోలా వినియోగించలేక పోతున్నాడు.

ఆ వేళంతా యిల్లుకదల్లేదు. అప్పుడే చీకటిపడుతోంది. లైటు వెలిగించి క్రింద హాలులో ఒంటిగా కూర్చున్నాడు. ప్రసన్నగురించి అల్లుకుంటున్న భావాలు ఆనందోన్మీలనము కలిగిస్తునాయ్. సోమసుందరం ఆ సమయంలో వచ్చి యీ ఆలోచనలకు అడ్డుపడి చిరాకెత్తించాడు. కాస్సేపు మౌనంగా వుండి "గోవిందం!" అన్నాడు గోవిందరావు ముఖం తనవేపు త్రిప్పకముందే "నేనూ ప్రసన్న పెళ్లి చేసుకోడానికి నిశ్చయించుకున్నాం. ఆమెకు నివ్వు సంరక్షకుడవట. నిన్ను చూడమని చెప్పింది"

గోవిందరావు చుట్టూ మంటలు లేచినయ్. సోమసుందరం మళ్ళీ అన్నాడు. "పెళ్లికి ఆమె యింత తొందరపడేది కాదు. పాపం! ఆమెనుంచి నీ భార్య నీ శీలాన్ని శంకించిందట. నన్ను తీసుకవెళ్లి యిదిగో యీయన నా భర్త అని చెప్తామని తొందరపడుతోంది" ఈ మాట లేవి సరిగా గోవిందరావు చెవికెక్కలేదు. మంటల్లో ఒళ్ళంతా కాలిపోతోన్నట్లే బాధపడుతూనే "రేపురా" అని మూలిగాడు. సోమసుందరం కదిలాక నెత్తికొట్టుకొని యేడవాలనిపించింది. ప్రేవులన్నీ కనలిపోయినట్లు, హృదయం దిగజారిపోతున్నట్లు గింజుకుపోయాడు.

లేచి లోనికివెళ్ళే సరికి ప్రసన్న చప్పున లేచి నిల్చుంది. ప్రతి కణంనుంచి పొంగుతున్న దుఃఖం, కోపం యీర్ష్య, అవమానం అన్నీ తనను నలిపివేస్తున్నయ్. ముఖం దించి పళ్ళతో దిగువ పెదిమను కఱచిపట్టాడు. నడుస్తూనే "ఒకసారిరండి" అన్నాడు' వేస్తున్న అడుగులు గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నయ్. ఆమె ఆ వినీలపు చీర చెంగు నెత్తిన వేసుకొని వెంట నెమ్మదిగా నడచింది.

మేడమీద గదిలో లైటు వేశాడు. ఆమె తల వంచుకొని వెనుకనే నిల్చుంది. తిరిగి చూసేసరికి యెన్ని మాటలు ఆడాలనుకున్నాడో ఒక్కమాటా దొరకలేదు. శరీరమంతా బాధతో బరువెక్కిపోయింది. అర్ధనిమీలిత నేత్రాలతోవున్న ఆ మూర్తి

వేపు చూస్తుండగానే నరాలన్నీ పట్లు తప్పి విజృంభించసాగినయ్. ఆ విజృంభణని అరికట్టలేదు - అరికట్టాలని ప్రయత్నించలేదు. డ్రాయరులోని బొమ్మతీసి ఆమె చేత పెట్టాడు. ఆమె దీక్షగా ఆ బొమ్మ వేపు చూస్తోంది. ఉలకదు పలకదు. అంత చేరువగా ఆమె నిదివరకు చూడలేదు. ఆమెలో వున్న పెదాలతీపి, కళ్ళల్లోని తళుకు, ముఖంలోని మోదం అంతా కూడ క్షణక్షణానికి హెచ్చిపోయి తనను దగ్గరదగ్గరగా అయస్కాంతంలా ఆకర్షించుకుంటున్నయ్. ఒక్కసారి ఆమె అజంతాలోని అప్సరసకన్యలా ఆ యెత్తినతల చూసిన చూపు అలావుంచే చలనంలేకండా నిల్చుండిపోయింది. గోవిందరావు ఆపలేని తలపు యేకాపు యేకంచేసి ఆ శిల్పాన్ని తల నుంచి కాళ్ళవరకూ నలిపివేశాడు. ఆమె అరవాలనుకుంది. గట్టిగా యేడవాలనుకుంది, చచ్చిపోయానే అనుకుంది కాని పెద్ద నిట్టూర్పైనా విడవలేకపోయింది. ఇన్నాళ్లూ యీయనమీద వుండే గౌరవం, నమ్మకం ఆ క్షణంలో ఆమెను అణచిపెట్టేశాయి.

గాలి వుడిగిన బంతిలా ఆమె కాళ్ళదగ్గర పడి వున్నాడు. ఒక రాతిని వుద్రేకంలో కౌగలించుకొని వున్నత శిఖరంనుంచి గడగడా క్రిందికి దొర్లి బురదగుంటలో పడ్డవానియట్లే చూస్తున్నాడు. ప్రసన్న ఆ నలిగిన బొమ్మతో కళ్లు కప్పుకొని వెక్కి వెక్కి యేడుస్తోంది. ఆ బొమ్మను అక్కడే పారవేసి కదలిపోయింది. క్రిందపడున్న బొమ్మ కన్నీటితో తడిసినా యెర్రటి మచ్చలతో వున్నట్లు కనపడింది. ఈ బొమ్మ వేసిన యిన్నాళ్ళకి యీ వేళ దానిలో ముడతలుపడ్డ శరీరం, యెముకలపోగు నిజంగా చూశాడు.